సాక్షి అనంతపురం

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



కల చెదిరి.. కష్టాలు ముదిరి
వీసాలు కఠినతరం కావడంతో అమెరికాలో 'అనంత' విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో



టమాట కిలో రూ.17
అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.5°/21.2°
జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జాతీయ లోక్ అదాలత్‌లో 6,542 కేసుల పరిష్కారం



జిల్లా కోర్టులో కక్షిదారులకు భోజనం వడ్డిస్తున్న జిల్లా జడ్జి భీమారావు

అనంతపురం: 'కోర్టు కేసుల్లో ఎవరో ఒకరే గెలుస్తారు. మరొకరు పరాజితులు అవుతారు. కానీ జాతీయ లోక్ అదాలత్‌లో లభించే పరిష్కారంలో ఇరువురూ విజేతలే' అని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమారావు అన్నారు. శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో మొత్తం 6,542 కేసులు పరిష్కారమయ్యాయి. 32 మోటార్ వాహన ప్రమాద కేసుల్లో రూ.1.26 కోట్లు, సివిల్ దావాల్లో రూ.84 లక్షలు, 2,351 ప్రీ లిటిగేషన్ కేసుల్లో రూ.1.04 కోట్లు, ఎన్ఐ యాక్ట్ కేసుల్లో రూ. 1.18 కోట్లు బాధితులకు నష్ట పరిహారం అందించారు. జాతీయ లోక్‌అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి సి. సత్యవాణి, అనంతపురం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తీరని యూరియా కష్టాలు



ఉద్దేహాళ్ సొసైటీ వద్ద ఆధార్‌కార్డులు, పాసు పుస్తకాలను లైనులో ఉంచిన రైతులు

బొమ్మనహాళ్: యూరియా కష్టాలు తీరడం లేదు. రైతు సేవా కేంద్రాలు, ఫర్టిలైజర్స్ దుకాణాలు, సొసైటీల వద్దకు యూరియా కోసం రైతులు పరుగులు పెడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పడిగాపులు కాస్తున్నారు. బొమ్మనహాళ్ మండలంలో అయితే రైతులు కష్టాలు చెప్పనలవిగా మారాయి. రాత్రిళ్లలోనే రైతు సేవా కేంద్రాల వద్ద ఆధార్ కార్డులు, పాసుపుస్తకాలు, చెప్పులు తదితరాలను క్యూలో ఉంచుతున్నారు. రెండు రోజుల క్రితం యూరియా బస్తాలతో శ్రీధరఘట్ట గ్రామ సొసైటీకి వెళ్తున్న లారీలను మార్గమధ్యంలోని ఉప్పరహాళ్ గ్రామంలోనే రైతులు ఆపేశారు. ఇప్పటి వరకు ఒక్క బస్తా ఇవ్వలేదని, అందుకే అడ్డుకున్నట్లు తెలిపారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో శాంతించారు.

ఒకటీ.. రెండే

రైతులకు సరిపడా ఎరువులు అందించడంలో కూటమి సర్కారు విఫలమవుతోంది. అరకొరగా యూరియాను తెప్పిస్తుండడంతో పంపిణీ కేంద్రాలకు రైతులు పోటెత్తుతున్నారు. ఈ క్రమంలో పోలీసుల ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేయాల్సిన దుస్థితి నెలకొంది. గంటల సేపు వేచి ఉన్నా ఒకటి లేదా రెండు బస్తాలే అందుతుండడంతో రైతుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. టీడీపీ వారికి 20 నుంచి 30 యూరియా బస్తాలు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జంట హత్యల కేసులో మరొకరికి రిమాండ్



రాప్తాడు: గంగలకుంట గ్రామ పొలంలో జరిగిన జంట హత్య కేసులో పది మంది నిందితుల అరెస్ట్ తర్వాత తాజాగా శనివారం మరొక నిందితున్ని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ప్రత్యేక విచారణ అధికారి, అనంతపురం నాల్గో పట్టణ సీఐ జగదీష్ శనివారం వెల్లడించారు. ఈ ఏడాది మే 17న గంగలకుంట గ్రామ పొలంలో గొల్లపల్లికి చెందిన రైతు చిగిచెర్ల నారాయణరెడ్డి, ముత్యాలమ్మ దంపతులపై టీడీపీ కార్యకర్తలు వేట కొడవళ్లు, కట్టెలతో దాడి చేసి హతమార్చిన విషయం తెలిసిందే. ప్రత్యక్ష సాక్షి, మృతుడు నారాయణరెడ్డి కుమారుడు చిగిచెర్ల ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు రాప్తాడు పోలీసులు 11 మందిపై కేసు నమోదు చేశారు. మే 19న ఆరుగురు నిందితులను రిమాండ్‌కు పంపారు. అదే నెల 21న మరొక నిందితుడు కోర్టులో లొంగిపోయాడు. అదే నెల 23న ఇంకొక నిందితుడిని, ఈ నెల 12న మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అజ్ఞాతంలో ఉన్న చివరి నిందితుడు గొల్లపల్లి పెద్దింటి జగదీష్ శనివారం హంపాపురం సమీపంలోని 44వ జాతీయ రహదారిపై తచ్చాడుతూ కనిపించగా.. పోలీసులు అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. హత్య జరిగి 120 రోజుల తర్వాత మొత్తం 11 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ కేసులోని 8 మంది నిందితులు 3 నెలల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చారు.

ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తే కేసులా?



ప్రజాస్వామ్య దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దారుణం. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు. నిజాలను వెలికితీస్తున్న 'సాక్షి'పై కూటమి సర్కార్ అక్కసు వెళ్లగక్కుతోంది. పోలీసు వ్యవస్థలో లోటుపాట్ల గురించి రాస్తే పత్రికా యాజమాన్యంపై కేసులు నమోదు చేసి విచారణ పేరుతో వేధిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. 'సాక్షి'పై కేసు నమోదును తీవ్రంగా ఖండిస్తున్నాం. వాక్ స్వాతంత్ర్యాన్ని హరించే హక్కు ఎవరికీ లేదు.

–వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ



రాష్ట్రంలో నియంతృత్వ పాలన



ప్రజాస్వామ్యానికి పత్రికలే పట్టుగొమ్మలు. అలాంటి పత్రికలపై కక్షగట్టి అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం. ఒక నాయకుడు ప్రెస్ మీట్ కవర్ చేసిన పత్రికపై కేసులు పెట్టడం దేశంలో ఎక్కడా చూడలేదు. కూటమి సర్కార్ నియంతృత్వ పాలనకు ఇది నిదర్శనం. 'సాక్షి' ఎడిటర్, తదితరులపై కేసులు పెట్టడం ద్వారా ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరిస్తోంది. ప్రజాస్వామ్యవాదులంతా సర్కారు చర్యలను ఖండించాలి.

–దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పుట్టపర్తి

అనంత నుంచే.. దోపిడీకి రాచబాట

గత టీడీపీ ప్రభుత్వంలో పీపీపీ పద్ధతిలో మెడాల్ ప్రాజెక్టు అనంతపురంలోనే పురుడు పోసుకుంది. 2014–19 మధ్య కాలంలో రక్తపరీక్షల పేరుతో భారీగా దోపిడీ సాగించింది. రక్త పరీక్షలు చేయకుండానే చేసినట్టు చూపి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టింది. ఇప్పుడు మళ్లీ అనంతపురం సభలో మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్వహిస్తామంటూ సీఎం చంద్రబాబు స్పష్టత ఇవ్వడంతో 'మెడాల్' దోపిడీని అందరూ గుర్తు చేసుకుంటున్నారు. మళ్లీ జిల్లా నుంచే దోపిడీకి ఆజ్యం పోస్తూ చేసిన ప్రకటనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'పీపీపీ'కి ఫుల్‌స్టాప్ పెట్టి ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ల్యాబులను ఉన్నతీకరించి పేదలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటే.. చంద్రబాబు మళ్లీ ఇప్పుడు ఆరోగ్య రంగాన్ని అగాథంలోకి నెట్టేలా నిర్ణయాలు తీసుకుంటుండడంపై ప్రజలు మండిపడుతున్నారు.



- గత టీడీపీ ప్రభుత్వంలో 'పీపీపీ' మాటున రూ. కోట్లు కొల్లగొట్టిన మెడాల్
- అప్పట్లో అనంతపురంలోనే పురుడు పోసుకున్న ప్రాజెక్టు
- రక్తపరీక్షలు చేయకుండానే చేసినట్లు చూపి ఖజానాకు కన్నం
- ఇప్పుడు మెడికల్ కాలేజీలు పీపీపీలోకి అంటూ 'అనంత'లోనే బాబు స్పష్టత
- దోపిడీకి మళ్లీ జిల్లా నుంచే రాచబాట వేశారంటూ సర్వత్రా విమర్శలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పీపీపీ.. క్లుప్తంగా పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్. ఈ పేరు టీడీపీకి బాగా అలవాటైన పదం. గతంలో పీపీపీ పేరున 'నీకింత నాకింత' అన్న చందాన దోచుకున్న తీరు జిల్లావాసులకే కాదు రాష్ట్ర ప్రజలందరికీ గుర్తుండే ఉంటుంది. అసలు ఈ పీపీపీ పద్ధతి పురుడు పోసుకున్నదే అనంతపురం జిల్లాలో కావడం గమనార్హం. అనంతపురం కరువు జిల్లా అని, తనకు ప్రాణమని చెప్పే చంద్రబాబు ఇక్కడి నుంచే దోపిడీ మొదలుపెట్టారనే విమర్శలు ఉన్నాయి.

మూడు నెలల్లోనే రాష్ట్రమంతటా..

2014లో రాష్ట్రం విడిపోయింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు అధికారం చేపట్టారు. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా రక్తపరీక్షల నిర్వహణ ప్రైవేటుకు అప్పజెబుతూ నిర్ణయించారు. దీనికి బీజం అనంతలోనే వేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఇక్కడ 6 మాసాలు నిర్వహించి ఆ తర్వాత అన్ని జిల్లాలకు విస్తరించాలనేది యోచన. అయితే, మూడు నెలలు కూడా అమలు కాకనే రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు ఆదేశాలిచ్చారు.

రూ.300 కోట్ల దోపిడీ..

2019 నాటికి అంటే ఆరేళ్ల క్రితమే పీపీపీ పద్ధతి ద్వారా అనంతపురం జిల్లాలో బీజం పడిన ఈ ప్రాజెక్టు ద్వారా సదరు ప్రైవేటు సంస్థ రూ.300 కోట్ల అవినీతికి పాల్పడినట్టు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లాలోని పలు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో రక్తపరీక్షలు చేయకపోయినా చేసినట్టు డాష్‌బోర్డులో చూపి కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారు. 2019 తర్వాత కొత్త సర్కారు వచ్చాక పీపీపీ పద్ధతిని రద్దు చేసి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సొంతంగా రక్త పరీక్షల నిర్వహణకు లేబొరేటరీలు పునరుద్ధరించింది.

ఇప్పుడు మళ్లీ..

'సూపర్‌సిక్స్–సూపర్‌హిట్' అంటూ అమలు కాని పథకాలనూ అమలు చేసినట్లు డప్పు కొట్టుకున్న 'అనంత' వేదిక నుంచే మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్వహించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడం గమనార్హం. ఇప్పటికే పెనుకొండలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల పనులు కూటమి సర్కారు వచ్చాక నిలిచిపోయాయి. 50 ఎకరాల్లో రూ.375 కోట్లతో కళాశాలను నిర్మించాలని గత వైఎస్సార్ సీపీ సర్కారు యోచించింది. అప్పట్లోనే రూ.30 కోట్లు ఖర్చు చేసింది. కానీ చంద్రబాబు తాజాగా 'పీపీపీ' అనడంతో పెనుకొండ మెడికల్ కాలేజీకి గ్రహణం పట్టినట్టయింది. స్వయానా ఈ నియోజకవర్గం నుంచి మంత్రిగా ఉన్న సవిత కళాశాలను కాపాడుకోవాల్సి పోయింది మౌనంగా ఉండటం మరిన్ని విమర్శలకు తావిస్తోంది.

ప్రైవేటు వ్యక్తులైతే జవాబుదారీగా ఉంటారట..!

మెడికల్ కాలేజీలన్నీ ప్రైవేటుకు అప్పజెబుతున్నాం. పీపీపీ పద్ధతిలో ఇవ్వాలని నిర్ణయించాం. ప్రైవేటు వ్యక్తులైతే నిర్వహణ పరంగా జవాబుదారీగా ఉంటారు. ప్రభుత్వానికి 50 శాతం సీట్లు వస్తాయి. మీకు ఏం తెలుసని మాట్లాడుతున్నారు.

– ఈనెల 10న అనంతపురంలో జరిగిన సభలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలివీ

రెచ్చిపోయిన 'పచ్చ' నేతలు

- భార్యాభర్తలపై కర్రలతో విచక్షణారహితంగా దాడి




ఎర్రమ్మ తలకు కుట్లు వేస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'పచ్చ' నేతలు రెచ్చిపోయారు. భార్యాభర్తలపై విచక్షణారహితంగా దాడికి దిగారు. ఆత్మకూరు మండలం తలుపూరు గ్రామంలో శనివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు.. తలుపూరు గ్రామానికి చెందిన గోసల కొండా, గోసల ఎర్రమ్మ భార్యాభర్తలు. వీరు శనివారం గ్రామ సమీపంలోని తమ పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే అదే గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ నేతలు అక్కడికి వెళ్లారు. ఈ భూమిలో వ్యవసాయం ఎలా చేస్తారు అంటూ దౌర్జన్యానికి దిగారు. సర్వే నంబర్ 68కు సంబంధించి భూమి సమస్య పెండింగ్‌లో ఉందని, తాము వ్యవసాయం చేస్తున్నది సర్వే నంబర్ 69లో అని గోసల కొండ చెబుతున్నా వినలేదు. భార్యాభర్తలపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. గోసల యర్రమ్మ తలకు తీవ్ర గాయాలు కాగా, కొండా కాలికి గాయమైంది. వెంటనే వారిని స్థానికులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యర్రమ్మ తలకు వైద్యులు కుట్లు వేశారు. కొండా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ నేతల ప్రోద్బలంతోనే తమపై దాడి చేశారని బాధితులు వాపోయారు. ఎర్రమ్మ ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

బీమా పరిహారంలో అబ్రకదబ్ర

- ఫసల్‌బీమా కింద రూ.77.49 కోట్లు అంటూ వ్యవసాయశాఖ ప్రకటన
- ఇంత మొత్తం పరిహారం వచ్చిందంటూ రైతులకు సమాచారం
- జమవుతోంది మాత్రం చిల్లరే
- మోసం చేస్తున్నారని రైతుల ఆవేదన


Dear Ramappa Gari Chandrasekhara Reddy
Farmer ID 91575273
Scheme: Pradhan Mantri Fasal Bima Yojna
Claim of Rs.8890.43 for Kharif 2024 could not be credited into your Aadhaar-linked bank A/C by FUTURE GENERALLI. Please contact the Insurance Company or call 14447 to raise a complaint.
For Details: https://pmfby.gov.in

చంద్రశేఖర్‌రెడ్డి అనే రైతుకు రూ.8,890 వచ్చినట్లు మెసేజ్ వచ్చినా జమ అయింది రూ.400 మాత్రమే

అనంతపురం అగ్రికల్చర్: అన్నదాత అడుగడుగునా దగా పడుతున్నాడు. గత రెండేళ్లుగా పంటలు పండక నష్టాల ఊబిలో నిండా మునిగిన రైతులను బీమా పేరుతో చంద్రబాబు సర్కారు మోసపుచ్చుతోంది. 2023 ఖరీఫ్, రబీ, అలాగే 2024 ఖరీఫ్, రబీలో అమలు చేసిన వాతావరణ బీమా, ఫసల్‌బీమా కింద ఇప్పటికీ పరిహారం ఇవ్వకుండా ఎగ్గొట్టే కుట్రలు చేస్తుండటంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాబు ప్రభుత్వాన్ని నమ్మి కట్టిన ప్రీమియం కూడా వెనక్కివచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

'ఫస'లేని బీమా..


ఫసల్‌బీమా కింద 2023 ఖరీఫ్, 2023 రబీ, అలాగే 2024 ఖరీఫ్‌కు సంబంధించి ఫ్యూచర్ జనరిక్ బీమా కంపెనీ నుంచి రూ.77.49 కోట్ల పరిహారం విడుదలైందంటూ ఈ ఏడాది ఆగస్టు 12న వ్యవసాయశాఖ విడుదల చేసిన ప్రకటనలో పసలేకుండా పోయింది. 2023 ఖరీఫ్‌లో కంది, ఎండుమిరప, జొన్న రైతులకు రూ.3.39 కోట్లు, రబీలో పప్పుశనగ, వేరుశనగ రైతులకు రూ.15.26 కోట్లు, 2024 ఖరీఫ్ కంది, జొన్న రైతులకు రూ.58.83 కోట్లు మొత్తంగా రూ.77.49 కోట్లు విడుదల చేశారని ప్రకటించారు. ఇంత మొత్తం పరిహారం వచ్చిందంటూ రైతుల మొబైల్ ఫోన్లకు సమాచారం కూడా పంపించారు. కానీ జమ చేసింది మాత్రం రూ.200, రూ.400, రూ.800 ఇలా చిల్లర విదిలించడం గమనార్హం. ఇదేమని అడిగితే అంతే జమ అయిందని బ్యాంకర్లు చెబుతుండగా... తమకేమీ తెలియదని, కనుక్కుంటామంటూ వ్యవసాయశాఖ చేతులెత్తేస్తోందని రైతులు వాపోతున్నారు.

వాతావరణ బీమాపై మౌనం:

2023, 2024 ఖరీఫ్, రబీలో అమలు చేసిన వాతావరణ బీమా పథకం గురించి కూటమి సర్కారు, వ్యవసాయశాఖ మౌనం పాటిస్తోంది. గత రెండేళ్లు అననుకూల వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలు దారుణంగా దెబ్బతినడంతో రైతులకు పెద్ద ఎత్తున నష్టం జరిగింది. వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమశాతం, సాగు విస్తీర్ణం, చీడపీడల వాతావరణం తదితర డేటా ఆధారంగానే వాతావరణ బీమా కింద పరిహారం ఇవ్వాల్సి ఉన్నా సర్కారు కొలువుదీరి 15 నెలలైనా నోరుమెదపడం లేదు. 2023 ఖరీఫ్‌లో 3.70 లక్షల హెక్టార్లకు గానూ 2.50 లక్షల హెక్టార్లు, 2024 ఖరీఫ్‌లో కూడా 3.47 లక్షల హెక్టార్లకు గానూ 3.20 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చాయి. 2023లో వేరుశనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాట పంటలకు, 2024లో వేరుశనగ, పత్తి, అరటి, టమాట, చీనీ, దానిమ్మ పంటలకు వాతావరణ బీమా వర్తింపజేశారు. పంటల బీమా పథకాలు సక్రమంగా అమలు చేయకుండా చంద్రబాబు సర్కారు దారుణంగా మోసం చేస్తోందని రైతులు మండిపడుతున్నారు.

ఆగిన ఆలయ అభివృద్ధి

- వీడని కూటమి గ్రహణం
- నిలిచిన ప్రహరీ, పుష్కరిణి పనులు



ప్రహరీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో బోసిపోయిన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయ ప్రాంగణం

రాయదుర్గంటౌన్: కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి కూటమి ప్రభుత్వ గ్రహణం పట్టింది. రాయదుర్గానికే తలమానికంగా ఉన్న కోటలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయ అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చొరవతో ఆలయ ప్రహరీ నిర్మాణంతోపాటు పుష్కరిణికి టీటీడీ నుంచి రూ.2.65 కోట్లు, దేవదాయశాఖ నుంచి రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేశారు. 2023లోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. సార్వత్రిక ఎన్నికలు జరిగే వరకు కూడా పనులు ముమ్మరంగా కొనసాగాయి. ఆలయం చుట్టూ పాత గోడను పడగొట్టి మంజూరైన నిధులతో దాదాపు 11 అడుగుల రాతి గోడలు నిర్మించేందుకు పనులు చేపట్టారు. దాదాపు 2 అడుగుల మేర ప్రహరీ నిర్మాణం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగైదు నెలలకే పనులు ఆగిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు పడకేశాయి.

పుష్కరిణి నిర్మాణంపై నీలినీడలు

ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రహరీ పనులే నిలిచిపోవడంతో ఇక పుష్కరిణి నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రహరీ పూర్తి కాకపోవడంతో ఆలయం కళావిహీనంగా కనిపిస్తోందని భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పరిసరాల్లో శుభ్రత లేదని, జంతువులు కూడా లోపలికి వస్తున్నాయని వాపోతున్నారు. ఇటీవల ఆలయ నూతన పాలకవర్గం కూడా కొలువుదీరింది. ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డిని వివరణ కోరగా.. పనులు నిలిచిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం





బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కలెక్టర్ ఆనంద్, స్వాగతం పలుకుతున్న అధికారులు

- ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారిస్తా..
- నూతన కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం అర్బన్: 'జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, అందరి సహకారంతో ముందుకు వెళతా. ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారిస్తా' అని నూతన కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు జేసీ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా అధికారులు, ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, సిబ్బంది కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద కూడా నూతన కలెక్టర్‌కు ఘన స్వాగతం లభించింది.

జిల్లాకు 104వ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆనంద్‌తో 'సాక్షి' మాటామంతీ.

సాక్షి: జిల్లాకు రావడం ఎలా ఉంది?

కలెక్టర్: అనంతపురం గొప్ప చరిత్ర ఉన్న జిల్లా. ఇక్కడ పనిచేసే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది.

సాక్షి: జిల్లా గురించి...

కలెక్టర్: రాయలసీమ జిల్లాల్లో పనిచేయడం ఇదే తొలిసారి. ముందుగా ఈ జిల్లా గురించి పూర్తిగా తెలుసుకుంటాను.

సాక్షి: కార్యాచరణ ఎలా ఉంటుంది?

కలెక్టర్: జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కార్యాచరణ ఉంటుంది. అందరి సహకారంతో అన్ని రంగాల్లో జిల్లాను ప్రగతి పథంలో నడిపించే విధంగా చర్యలు ఉంటాయి.

సాక్షి: పదోన్నతుల్లో జాప్యంపై దృష్టి సారిస్తారా?

కలెక్టర్: ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతాం. ఇప్పుడే బాధ్యతలు తీసుకున్నాను. ఉద్యోగుల పదోన్నతులు ఇతర అంశాలపై అధికారులతో సమీక్షించి పరిష్కార చర్యలు చేపడతాను.

సాక్షి: ఉద్యోగులకు మీరిచ్చే సందేశం

కలెక్టర్: ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలతో మమేకమై పనిచేయాలి. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు సత్వరం అందించాలి.

అనంత ప్రగతికి అధికారులు సహకరించాలి

అనంతపురం అర్బన్: ''మనందరి లక్ష్యం జిల్లా అభివృద్ధి. ఇందుకు అన్ని శాఖల అధికారులు సహకారం అందించాలి. శాఖల పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయండి. ముఖ్యమంత్రి నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా'' అని కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోలతో కలిసి అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో పంటల సాగు, యూరియా డిమాండ్, రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, హార్టికల్చర్ అసిస్టెంట్లు, సత్యసాయి తాగునీటి పథకం, ప్రజాసమస్యల పరిష్కార వేదిక తదితర అంశాలపై ఆరా తీశారు. సమావేశంలో ఆర్డీఓ కేశవనాయుడు, సీపీఓ అశోక్‌కుమార్, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, డీపీఓ నాగరాజు నాయుడు, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనంతపురం క్రికెట్‌కు వన్నె తెచ్చిన అనూష



రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న మాంఛో ఫెర్రర్

అనంతపురం: భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి అనంతపురం క్రికెట్ చరిత్రకు వన్నె తెచ్చిన గొప్ప క్రీడాకారిణి అనూష అని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అన్నారు. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో శనివారం రాయలసీమ క్రికెట్ మైదానాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించారు. జిల్లాలో క్రికెట్ అభివృద్ధిని ప్రోత్సహించడానికి సీనియర్ క్రీడాకరులు చొరవ చూపించాలన్నారు. ఈ సందర్భంగా భారత జట్టు మహిళా క్రికెటర్ అనూషకు లక్ష రూపాయల చెక్కును జిల్లా క్రికెట్ సంఘం తరపున మాంఛోఫెర్రర్ అందజేశారు. అనంతరం సీనియర్ క్రికెటర్లు ఒక మ్యాచ్ ఆడారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వి.భీమలింగారెడ్డి, వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, మాజీ అధ్యక్షుడు పి.మల్లికార్జున, మాజీ రంజీ క్రీడాకారలు కేఎస్ షాబుద్దీన్, ఎల్ఎస్ ప్రసాద్‌రెడ్డి, కేపీ ఫయాజ్ అహమ్మద్, డి.సురేష్, షేక్షావలి, డీబీ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఆరు నెలల జైలు

పామిడి: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష పడింది. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ యుగంధర్ శనివారం మీడియాకు వెల్లడించారు. 2015 డిసెంబర్ 24న కోయలదిన్నె లలితమ్మ భర్త పామిడిలోని రోడ్డు ప్రనమాదంలో మృతి చెందారు. లలితమ్మ ఫిర్యాదుకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి గత శుక్రవారం విచారణ జరిగింది. ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేఖ వాదనలు వినిపించారు. రోడ్డు ప్రమాదానికి కారకుడు సయ్యద్ అబూబ్ అని తేలడంతో గుత్తి జేఎఫ్‌సీఎం జడ్జి అనిల్‌కుమార్ ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

కుందుర్పి: రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. జానంపల్లికి చెందిన విరుపాక్షి (50) తన పొలంలో సాగు చేసిన టమాట పంటకు పురుగుమందులు తీసుకొచ్చేందుకు శనివారం కుందుర్పికి వెళ్లాడు. అక్కడ మందులు తీసుకుని ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా అప్పిలేపల్లి - జానంపల్లి మార్గం మధ్యలో అదుపుతప్పి గోతిలోపడ్డాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కల చెదిరి.. కష్టాలు ముదిరి



అమెరికాలో 'అనంత' విద్యార్థుల ఇబ్బందులు

- వీసాలు కఠినతరం కావడంతోనే ఇలాంటి పరిస్థితి
- పార్ట్‌టైం ఉద్యోగాలు లేక తల్లిదండ్రుల మీద ఆర్థికభారం
- కోర్సు పూర్తయినా.. వస్తే తిరిగి వెళ్లలేమని అక్కడే ఉద్యోగాల వేట
- అమెరికాలో చదువుకు రూ.లక్షల్లో లోన్లు తీసుకుని వర్సిటీలకు చెల్లింపు
- గడిచిన నాలుగేళ్లలో 2,500 మందికి పైగా విద్యార్థులు అమెరికాలోనే

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అమెరికాలో ఉన్న విద్యార్థుల పరిస్థితి ఇప్పుడు చాలా ఇబ్బందికరంగా ఉంది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షులుగా వచ్చాక సరికొత్త ఆంక్షలతో వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లానుంచి ఏటా 400 మందికి పైగా విద్యార్థులు ఎంఎస్ చదవడానికి అమెరికా వెళుతున్నట్టు అంచనా. గడిచిన రెండేళ్లుగా మాస్టర్స్ కోసం అమెరికా వెళ్లిన విద్యార్థులు కోర్సు పూర్తయినా ఇక్కడకు రాలేక, వస్తే తిరిగి వెళ్లలేని పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో అభ్యర్థి సగటున రూ.60 లక్షలకు పైగా ఎడ్యుకేషన్ లోన్ తీసుకుని వెళ్లారు. గతంలో చదువు పూర్తికాకమునుపే సెలవుల్లో స్వదేశానికి వచ్చి వెళ్లేవారు. ఇప్పుడు ఇమిగ్రేషన్ నిబంధనలు కఠినతరంగా ఉండటంతో రాలేక పోతున్నారు.

పార్ట్‌టైం లేక.. ఉద్యోగమూ రాక..

అమెరికాలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ యూనివర్సిటీల్లో కోర్సులు పూర్తి చేశారు. కొంతమంది చదువుతున్నారు. వీరిలో కోర్సు పూర్తయిన వారిలో కొంతమందికి అక్కడ మార్కెట్ సరిగా లేక ఉద్యోగాలు రాలేదు. ట్రంప్ వచ్చాక పార్ట్‌టైం ఉద్యోగమూ చేసే అవకాశం లేదు. దీంతో చాలామందికి తల్లిదండ్రులు ఇంటినుంచే డబ్బు పంపించాల్సి వస్తోంది. నెలకు సగటున రూ.80 వేల నుంచి రూ.లక్ష ఖర్చవుతున్నట్టు విద్యార్థులు చెబుతున్నారు. ఇక్కడకు రాలేక, వస్తే తిరిగి వెళ్లలేక సతమతమవుతున్నారు.

ఎడ్యుకేషన్ లోన్లు కుంపటిలా..

చాలామంది విద్యార్థులు పలు ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల నుంచి రూ.50 లక్షలు, అంతకంటే ఎక్కువగా ట్యూషన్ ఫీజును బట్టి ఎడ్యుకేషన్ లోన్ తీసుకున్నారు. కోర్సు పూర్తయ్యాక ఆయా ఫైనాన్స్ సంస్థలకు ఈఎంఐ కట్టాల్సి ఉంటుంది. కానీ ఉద్యోగాలు రావడం జాప్యం జరుగుతుండటంతో అటు విద్యార్థుల్లోనూ, ఇటు తల్లిదండ్రుల్లోనూ ఆందోళన నెలకొంది. ఇండియాకు తిరిగొస్తే ఇక్కడ కూడా పరిస్థితి బాగా లేదని, అమెరికాలోనే మరికొన్ని రోజులు కష్టపడి ఉద్యోగం తెచ్చుకుందామన్న ఆశతో అక్కడే ఉన్నారు.

వస్తే మళ్లీ రాలేమని..

బోస్టన్ యూనివర్సిటీలో నెల కిందట కోర్సు పూర్తయింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇండియాకు రావడం కష్టం. వచ్చామంటే తిరిగి అమెరికాకు రాలేం. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా. దీనికి వేరే ప్రత్యామ్నాయం లేదు. –డి.శిరీష, ధర్మవరం

కష్టమైనా ఇక్కడే ఉండాల్సిందే

ప్రస్తుతం పరిస్థితులు ఇక్కడ అనుకూలంగా లేవు. మార్కెట్ లేక ఉద్యోగాలకు చాలా ఇబ్బందిగా ఉంది. బోస్టన్ యూనివర్సిటీలో మరో రెండు మాసాల్లో నా కోర్సు పూర్తవుతుంది. పార్ట్‌టైం ఉద్యోగం క్యాంపస్‌లో ఉంటేనే చేసుకోవాలి. బయట అవకాశం లేదు. ఉద్యోగం కోసం ఇప్పటి నుంచే దరఖాస్తు చేస్తున్నాను. –ఎస్.దినేష్‌కుమార్, అనంతపురం

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా

మా కొడుకు పిట్స్‌బర్గ్‌లో ఎంఎస్ పూర్తి చేశారు. ఇంకా ఉద్యోగం రాలేదు. నెలకు లక్ష రూపాయలు పంపించాల్సి వస్తోంది. ఉద్యోగం కోసం చాలా ప్రయత్నిస్తున్నాడు. ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాను. –ఎన్‌వీ సుబ్బారెడ్డి, రిటైర్డ్ టీచర్, అనంతపురం

మాజీ మంత్రి శైలజానాథ్‌కు అస్వస్థత



చికిత్స పొందుతున్న శైలజానాథ్

శింగనమల: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతో ఇబ్బంది పడుతున్నా ఈ నెల 9న అనంతపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన 'అన్నదాత పోరు'లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం హైదరాబాద్‌లోని సొంతింటికి వెళ్లారు. ఉన్నట్టుండి శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను ఆపోలో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. శైలజానాథ్ త్వరగా కోలుకోవాలని కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, అభిమానులు కోరుకుంటున్నారు.

నేలకూలిన భారీ వృక్షం



గుత్తి: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలోని భారీ వేప వృక్షం మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులకు శనివారం నేలకూలింది. ఆ సమయంలో జనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు కూలిన విషయాన్ని సబ్ రిజిస్ట్రార్ సిబ్బంది ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్టు అధికారులు కూలిన సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

నవంబర్ 7 నుంచి రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు

- హాజరు కానున్న 2 వేల మంది ఉద్యోగులు
- రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: అనంతపుం వేదికగా రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు నవంబరు 7 నుంచి మూడు రోజులపాటు పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రకటించారు. అనంతపురం విచ్చేసిన ఆయన శనివారం రెవెన్యూ హోమ్‌లో డీఆర్ఓ మలోల, రెవెన్యూ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ రాజేష్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధ్యక్షులు దివాకర్ రావు, మైనుద్దీన్, మహిళా విభాగం అధ్యక్షురాలు సురేఖరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్ల సహకారంతో క్రీడలను ఉత్సాహంగా ఉల్లాసంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు. పనిఒత్తిడిలో ఉండే రెవెన్యూ ఉద్యోగులకు ఈ క్రీడా ఉత్సవాలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. తొలిరోజు 7న కార్యక్రమాన్ని సీసీఎల్ఏ ప్రారంభిస్తారన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హాజరవుతారని పేర్కొన్నారు. ఇక ముగింపు కార్యక్రమానికి ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఇప్పటికే అందరినీ కలిసి ఆహ్వానించామన్నారు. హోదా తారతమ్యం లేకుండా క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల్లో రెవెన్యూ ఉద్యోగులు వీఆర్ఏ మొదలు డిప్యూటీ కలెక్టర్ స్థాయి వరకు అందరూ పాల్గొంటారన్నారు. జిల్లా ఒక యూనిట్‌గా 26 జిల్లా యూనిట్లు, సీసీఎల్ఏ యూనిట్ మొత్తం 27 యూనిట్ల నుంచి దాదాపు 2 వేల మంది ఉద్యోగులు పాల్గొంటారని వెల్లడించారు. క్రీడా కార్యక్రమాల్లో ఐఏఎస్ అధికారులందరూ పాల్గొంటారన్నారు. రెవెన్యూ క్రీడలు నిర్వహించేందుకు సహకారం అందిస్తున్న ప్రభుత్వానికి, ఆర్డీటీ యాజమాన్యానికి రెవెన్యూ ఉద్యోగుల సంఘం తరపున ధన్యావాదాలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల షెడ్యూల్‌ను నాయకులు విడుదల చేశారు.

హామీల అమలులో సర్కారు విఫలం

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీల అమలులో కూటమి సర్కారు విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోట్రేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశానికి నారాయణస్వామి అతిథిగా హాజరై మాట్లాడారు. 20 లక్షల ఉద్యోగాల కల్పిస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడు డీఎస్సీ మినహా ఇతర నోటిఫికేషన్లు ఇవ్వకుండా యువతను దారుణంగా మోసం చేశారన్నారు. నిరుద్యోగభృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. హామీల అమలు కోసం యువత ఉద్యమ బాట పట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ వివిధ డిమాండ్ల సాధనకు రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 17న విజయవాడలో 'నిరుద్యోగుల ఆవేదన రాష్ట్ర సదస్సు' నిర్వహించనున్నామన్నారు. సమావేశంలో నాయకులు దేవేంద్ర, వంశీకృష్ణ, ధనుంజయ, శ్రీనివాసులు, నాయక్, తేజ, తదితరులు పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం

- ఫుట్‌పాత్‌పై వృద్ధుడి నరకయాతన
- ఆకలి తీర్చి.. ఆటోలో ఆస్పత్రికి చేర్చి
- ఆదర్శంగా నిలిచిన ఇంటర్ విద్యార్థినులు



వృద్ధుడిని ఆస్పత్రికి చేర్చిన విద్యార్థినులతో ఆర్ఎంఓ హేమలత, సీఎంఓ కార్తీక్‌రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మలాదేవి

అనంతపురం సిటీ: ఓ వైపు అనారోగ్యం.. మరోవైపు ఆకలిబాధ తట్టుకోలేక ఫుట్‌పాత్‌పై వృద్ధుడు ఆర్తనాదాలు చేస్తున్నాడు. ఆ మార్గంలో ఎంతోమంది వెళ్తున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. కానీ నలుగురు విద్యార్థినులు స్పందించారు. దగ్గరకు వెళ్లి ఆయన బాధ కనుక్కొని అన్నం పెట్టి.. ఆపై ఆస్పత్రిలో చేర్చి మానవత్వం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం పాముదుర్తికి చెందిన సత్యనారాయణ (70) షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైన ఆయన అనంతపురం చేరాడు. జిల్లాపరిషత్ కార్యాలయం ఎదుట ఫుట్‌పాత్‌పై పడి ఉన్నాడు. నాలుగు రోజులుగా అన్నపానీయాలు లేక నీరసించిపోయాడు. శనివారం ఆకలికి తాళలేక గట్టిగా కేకలు వేస్తున్నాడు. అటుగా రాకపోకలు సాగిస్తున్నవారు చూస్తూ పోతున్నారే కానీ ఎవ్వరూ ఆయన బాధ ఏమిటో కనుక్కోలేక పోయారు. అదే సమయంలో కేఎస్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్న త్రివేణి, కళ్యాణి, శిరీష, లల్లీశ్రీ ఆ వృద్ధుడి దీనస్థితి చూసి చలించిపోయారు. అయ్యో పాపం.. అంటూ దగ్గరకు వెళ్లగానే దుర్వాసన వచ్చింది. కాలు కుళ్లిపోయి.. పురుగులు పట్టి కదలలేని స్థితిలో ఉన్న అతడిని 'ఏమైంది తాతా' అంటూ ఆరా తీశారు. అతను కడుపు పట్టుకుని ఆకలి అవుతున్నట్లు తెలిపాడు. ఆ విద్యార్థినులు తమ వద్ద ఉన్న చిల్లర డబ్బు పోగు చేసుకుని హోటల్‌నుంచి భోజనం తీసుకొచ్చి తినిపించారు. ఆ తర్వాత ఆటోను పిలిచి వృద్ధుడిని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. సంతకాలు పెడితేనే అడ్మిషన్ చేసుకుంటామని చెప్పడంతో విద్యార్థినులు నేరుగా ఆర్ఎంఓ డాక్టర్ గుజ్జల హేమలతను కలిసి విషయం తెలిపారు. ఆమె ఆలస్యం చేయకుండా విద్యార్థినులకు ధైర్యం చెప్పి.. క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) డాక్టర్ కార్తీక్‌రెడ్డి, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మలాదేవిని వెంటబెట్టుకొని క్యాజువాలిటీకి చేరుకున్నారు. దుర్వాసన వస్తున్న వృద్ధుడికి సిబ్బంది చేత స్నానం చేయించిన తర్వాత అన్ని రకాల పరీక్షలు చేయించారు. కుళ్లిపోయిన కాలును తొలగించాలని, లేకుంటే ప్రాణానికే ప్రమాదమని వైద్యులు తేల్చారు. అడ్మిషన్‌లో ఉంచి చికిత్స చేస్తున్నారు. మానవత్వంతో స్పందించిన విద్యార్థినులు త్రివేణి, కళ్యాణి, శిరీష, లల్లీశ్రీని ఆర్ఎంఓ, సీఎంఓ ప్రశంసించారు. విద్యార్థి లోకానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

యువకుడిపై పోక్సో కేసు

అనంతపురం: నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్న బాలికకు మాయమాటలు చెప్పిన మోసం చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు. ఆత్మకూరు మండలం గొరిదిండ్లకు చెందిన బోయ పోతులయ్య ఈ నెల 11న బాలికను తీసుకుని వెళ్లిపోయాడు. తమ కూతురు కనిపించడం లేదని పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. రెండు రోజుల తర్వాత బాలిక అనంతపురం చేరుకుంది. తనకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని ఫిర్యాదు ఇవ్వడంతో పోతులయ్యపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

గుత్తిలో మరొకటి...

గుత్తి: పట్టణంలో రమేష్ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. ఇతడు కొంతకాలంగా ఓ బాలికను వేధిస్తున్నాడు. రోజురోజుకూ వేధింపులు తారస్థాయికి చేరుకుంటుండటంతో బాలిక తన తల్లిదండ్రులకు విషయం చెప్పింది. వారు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రమేష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుంతకల్లు: గుంతకల్లు–బళ్లారి సెక్షన్‌లోని బెవనహల్–టి.సాకిబండ రైల్వేస్టేషన్ మధ్య 55 నుంచి 60 ఏళ్ల లోపు వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. శరీరంపై రక్తగాయాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రమాదవశాత్తూ రైలు నుంచి కింద పడి మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. మృతని వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదన్నారు. ఆచూకీ తెలిసిన వారు 98661 44616కు సమాచారం అందించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు తోపుదుర్తి విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో పీడీ శ్రీవాణి

ఆత్మకూరు: తోపుదుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ శ్రీవాణి తెలిపారు. శనివారం ఎస్కే యూనివర్సిటీ వద్ద లక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్ –19 విభాగంలో బ్లెస్సీ, లిఖిత, అండర్ –17విభాగంలో రాజేశ్వరి ఎంపికయ్యారని తెలియజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను హెచ్ఎమ్ సాంబశివారెడ్డి అభినందించారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి



మృతిచెందిన శంకరయ్య

పెద్దపప్పూరు: ట్రాక్టర్ (కంప్రెజర్) బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. చిక్కేపల్లికి చెందిన కురుబ శంకరయ్య (40) కంప్రెజర్ ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. శనివారం పెద్దపప్పూరుకు వెళ్తుండగా నామనాంకపల్లి - షేక్‌పల్లి గ్రామాల మధ్యకు రాగానే వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శంకరయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ఆస్పత్రికి తరలించారు.

ఆటోడ్రైవర్ల ఆర్థికసాయానికి మార్గదర్శకాలు

అనంతపురం సెంట్రల్: ఆటో, మోటర్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు, యజమానులకు రూ.15 వేల ఆర్థికసాయం అందజేసేందుకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలైనట్లు ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) ఎం.వీర్రాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రైవర్ కం యజమానిగా ఉండే వ్యక్తి కుటుంబానికి 2025–26 సంవత్సరానికి సంబంధించి రూ.15వేలు ప్రభుత్వం మంజూరు చేస్తుంది. వాహన యజమాని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వ్యక్తి ఒకే కుటుంబానికి చెందిన వారై ఉండాలి. మోటార్, మ్యాక్సీ క్యాబ్ విషయంలో వాహనానికి సంబంధించి రిజిస్ట్రేషన్, ఫిట్నెస్ సర్టిఫికెట్స్, మోటర్ వాహన ట్యాక్స్ కలిగి ఉండాలి. ఆటో రిక్షా విషయంలో నెలరోజుల లోపు ఫిట్నెస్ చేయించుకోవాలి. ప్యాసింజర్ ఆటో రిక్షాలు మాత్రమే ఈ పథకానికి అర్హులు. గూడ్స్ ఆటో యజమానులు అర్హులు కాదు. వాహనం దరఖాస్తుదారుని అధీనంలో ఉండాలి. ఆధార్‌కార్డు, బీపీఎల్– తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండాలి. దరఖాస్తుదారు, అతని కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగులు కాకూడదు. శానిటరీ పనిచేసే వారి కుటుంబసభ్యులకు మినహాయింపు ఉంటుంది. ఇన్‌కంట్యాక్స్ చెల్లింపుదారు, నెలకు 300 యూనిట్లు, అంత కంటే ఎక్కువ కరెంటు వినియోగించే వారు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు ఎకరాల మాగాణి, పది ఎకరాలు పైగా మెట్ట భుములు ఉన్న వారు, మున్సిపాలిటీల్లో 1000 స్క్వేర్ మీటర్లు స్థలం ఉండే వారు ఆర్థికసాయానికి అనర్హులు. అర్హత కలిగిన వారు ఈ నెల 17 నుంచి 19 లోగా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 24లోగా అర్హుల జాబితా ప్రకటిస్తారు. అక్టోబర్ 1న సీఎం ఆర్థికసాయం విడుదల చేస్తారని డీటీసీ వివరించారు.

రేపటి నుంచి యూటీఎఫ్ 'రణభేరి'

ధర్మవరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి 'రణభేరి' ప్రారంభమవుతోందని రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలనే డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో ఈ నెల 15 నుంచి 19 వరకు 'రణభేరి' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 15న పశ్చిమ రాయలసీమ ప్రాంతంలోని కర్నూలులో ప్రారంభమవుతుందన్నారు. 16న అనంతపురం జిల్లా, 17న శ్రీసత్యసాయి జిల్లా, 18న అన్నమయ్య జిల్లా, 19న కడప, నంద్యాల జిల్లాల్లో 'రణభేరి' యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణనాయక్, నాయకులు లక్ష్మయ్య, జింకా హరికృష్ణ, నాగిరెడ్డి, హెచ్.రామాంజనేయులు, సాయి గణేష్, ఆంజనేయులు, అమర్ నారాయణరెడ్డి, రాంప్రసాద్, బిల్లే రామంజినేయులు, వెంకట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత నుంచి ప్రాణహాని

- జీఆర్పీ కానిస్టేబుల్ ఫిర్యాదు

గుత్తి: టీడీపీ పట్టణ కన్వీనర్, జనతా మార్ట్ నిర్వాహకుడు ఎంకే చౌదరి నుంచి తనకు ప్రాణహాని ఉందని జీఆర్పీ కానిస్టేబుల్ వాసు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తానంటూ ఏడాదికాలంగా బెదిరిస్తూ మానసికంగా వేధిస్తున్నాడని పేర్కొన్నాడు. ఈ క్రమంలోనే గత శుక్రవారం ఎంకే చౌదరి 50 మంది అనుచరులతో కలిసి దాడి చేసి. తనపైనే పోలీసు కేసు పెట్టాడని ఆవేదన చెందాడు. ఎస్పీని కూడా కలిసి విన్నవించుకుంటానని చెప్పాడు. భవిష్యత్‌లో కూడా తనపై దాడి జరిగే అవకాశమున్నందున రక్షణ కల్పించాలని కోరాడు. తనపై జరిగిన దాడికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌ను కూడా ఫిర్యాదుకు జత చేశాడు. విచారణ చేస్తున్నామని ఎస్ఐ సురేష్ తెలిపారు.

థియేటర్‌లో చోరీ

కొత్తచెరువు: మండల కేంద్రం కొత్తచెరువులోని పుట్టపర్తి రోడ్డులో గల సందీప్ థియేటర్‌లో శనివారం తెల్లవారుజామున రూ.ర51 వేల నగదు చోరీ జరిగినట్లు థియేటర్ మేనేజర్ పెద్దిరెడ్డిగారి నరసింహారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రంగంలోకి దిగిన సీఐ మారుతీప్రసాద్ సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నగదు చోరీ చేసినది లక్ష్మి థియేటర్ వాచ్‌మెన్ బి.ధనుష్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు.

క్లుప్తంగా

నగరంలో నేడు

• సామూహిక కోటి కుంకుమార్చన

అనంతపురం కల్చరల్: శ్రీ మాతృదేవి విశ్వ శాంతి ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ లలితా పరమేశ్వరిదేవి కోటి కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రమోద్‌స్వామి తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు స్థానిక టీటీడీ కల్యాణమండపం వేదికగా కార్యక్రమం ఉంటుందన్నారు.

• సంగీతోత్సవం

రామ్స్ క్లాసిక్ ఆధ్వర్యంలో పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు ముందస్తు జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుంచి స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో జరిగే సంగీతోత్సవానికి కళాభిమానులు విచ్చేయాలని కోరారు.

సాంస్కృతిక వారసత్వంపై అవగాహన ఉండాలి


ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

అనంతపురం కల్చరల్: దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ప్రముఖ వ్యక్తులు తదితర అంశాలపై విద్యార్థులు సమగ్ర అవగాహన కల్గి ఉండాలని ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్ అన్నారు. శనివారం ఇంటాక్ (భారతీయ కళలు, వారసత్వ పరిరక్షణ సంస్థ) ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందించారు. కవి టీవీరెడ్డిని జీవిత కాల సభ్యునిగా చేర్చుకుంటున్నట్టు ప్రకటించారు.అంతకు ముందు జిల్లా కో కన్వీనర్ పిడతల కృష్ణమూర్తి, డాక్టర్ జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, శ్రీనిధి రఘు తదితరులు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగభూషణం, బీజీఆర్ గుప్తా, మహమ్మద్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం


మాట్లాడుతున్న పాఠశాల చైర్మన్ అనంతరాముడు

అనంతపురం: అనంతలక్ష్మీ ఇంటర్నేషనల్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రైఫిల్ షూటింగ్, స్విమ్మింగ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. శనివారం అనంతలక్ష్మీ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ ఎం.అనంత రాముడు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీలు శ్రీనివాసులు, శకుంతలమ్మ, ఆర్గనైజర్ కోచ్ రాహుల్‌బాబు, నవీన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి పంచాయతీ తీర్మానం ప్రతి

రాప్తాడురూరల్: జిల్లా పేదలకు సాయంగా ఉన్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి అమిత్ షాకు అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ తీర్మానం ప్రతిని పోస్టల్ ద్వారా పంపారు. ఈ విషయాన్ని శనివారం ఫెర్రర్‌కాలనీ వాసులతో కలసి సర్పంచ్ బండా అంజియాదవ్ వెల్లడించారు. జిల్లాలో నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు ఆర్డీటీ సంస్థ అండగా ఉంటోందన్నారు. ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. అలాంటి సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయకపోవడం తగదన్నారు.

రజకులపై దాడులు అరికట్టాలి

అనంతపురం టవర్‌క్లాక్: కృష్ణా జిల్లా బందర్ మండలం మంగినిపూడి గ్రామానికి చెందిన రజకుడు గిరిధర్ కుమార్‌పై జనసేన నాయకులు దాడి చేయడం దారుణమని రజక సంఘాల పోరాట సమితి కో-కన్వీనర్ హనుమన్న అన్నారు. శనివారం స్థానిక సమితి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రజకులపై దాడులు ఎక్కువయ్యాయని విమర్శించారు. తక్షణం దాడులను అరికట్టి..నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

కుమ్మేసిన వాన


రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో అవస్థలు పడుతున్న మహిళ


అనంతపురంలో వానలోనే ప్రయాణిస్తున్న వాహనదారులు

అనంతపురం మెడికల్: నగరంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మారుతీనగర్ తో పాటు ఖాజానగర్, ఎర్రనేల కొట్టాలు, గుల్జార్ పేట తదితర చోట్ల పెద్ద ఎత్తున నీరు నిలిచింది. మారుతీనగర్‌లో అంబేడ్కర్ బ్రిడ్జ్‌కు ఆనుకుని ఉన్న రోడ్డులో మోకాళ్ల ఎత్తుకు నీరు చేరింది. వీధుల్లో భారీగా వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇళ్లలోకి సైతం నీరు చేరుకుంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతోనే దుస్థితి తలెత్తిందని స్థానికులు వాపోయారు.


నగరంలో కురుస్తున్న వర్షం


ఇంట్లోకి చేరిన వర్షపు నీటిని బయటకు తోడేస్తున్న దృశ్యం


రామ్‌నగర్ పక్కన ఉన్న కాలనీలు జలమయమైన దృశ్యం


గుల్జార్ పేటలో నిలిచిన వర్షపు నీరు


శ్రీకంఠం సర్కిల్‌లో దుస్థితి


నీళ్లలో వాహనాన్ని తోసుకుని వెళ్తున్న బాలుడు


వర్షపు నీటిలోనే వెళ్తున్న వాహనదారులు


గుత్తిరోడ్డులో పడుతున్న వాన

తోపుదుర్తి భాస్కర్ రెడ్డికి నివాళి


తోపుదుర్తి భాస్కర్ రెడ్డి సతీమణి కవితను పరామర్శిస్తున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి


భాస్కర్ రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శివరామి రెడ్డి





విషణ్ణ వదనంలో మాజీ మంత్రి శంకరనారాయణ, నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్ రెడ్డికి రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. ఈ నెల 12న ఆయన ఆకస్మిక మరణం పొందిన విషయం విదితమే. శనివారం సీడబ్ల్యూసీ సభ్యులు, మాజీ మంత్రి ఎన్.రఘువీరా రెడ్డితో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు వరదరాజుల రెడ్డి, పల్లె సింధూర, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రులు శంకర్ నారాయణ, పల్లె రఘునాథ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మధుసూదన్ గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సుధాకర్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త రంగయ్య, పార్టీ పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, ఎస్కేయూ మాజీ వీసీ కుసుమకుమారి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

నేడు అంతిమయాత్ర

అనంతపురం ఎడ్యుకేషన్: తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి భౌతికకాయానికి ఆదివారం ఉదయం 8 గంటలకు రామచంద్రనగర్‌లోని నివాసం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామరెడ్డి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామంలోని వ్యవసాయ క్షేత్రం వరకు యాత్ర సాగుతుందన్నారు. 10 గంటలకు అంతిమ వీడ్కోలు నిర్వహిస్తారని వెల్లడించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


అలంకరణలో కొండమీదరాయుడు

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని ప్రముఖ ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న దేవరకొండపై వెలసిన కొండ మీద రాయుడి ఆలయంలో శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు స్వామి వారికి కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కొండ కింద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొందిపల్లికి చెందిన పద్మనాభరెడ్డి పని నిమిత్తం రాయలచెరువుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి గ్రామానికి వెళ్తుండగా జక్కలచెరువు గ్రామ శివారులో గుత్తి నుంచి యాడికికి వెళ్తున్న ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో పద్మనాభరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. ఇదే ప్రమాదంలో యాడికి ఆస్పత్రి కాలనీకి చెందిన దంపతులకు గాయాలు కాగా వారిని బంధువులు తాడిపత్రి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా పక్కదారి పట్టకూడదు


రాప్తాడులో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న అల్తాఫ్ అలీఖాన్

రాప్తాడు: యూరియా పక్కదారి పట్టకూడదని, ఇందుకోసం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ అధికారులను ఆదేశించారు. ఏ పంటకు ఎంత మోతాదులో యూరియా ఉపయోగించాలనే వివరాలు తెలిసేలా పోస్టర్లు తయారు చేసి రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల వద్ద ప్రదర్శించాలన్నారు. శనివారం ఆయన రాప్తాడులో ఫెడరేషన్ ఎఫ్‌పీఓ షాపును తనిఖీ చేశారు. అనంతరం యూరియా కోసం వచ్చిన రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం మండలంలో రాప్తాడు పంచాయతీకి 280 బ్యాగుల యూరియా అందుబాటులో ఉందన్నారు. త్వరలో మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు యూరియా వస్తుందన్నారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎంత మోతాదులో యూరియా ఉపయోగించాలో అంతే వాడుకోవాలన్నారు. అనంతరం ఆయన గొందిరెడ్డిపల్లి గ్రామంలో పర్యటించారు. వ్యవసాయ సిబ్బంది పొలాల్లో చేస్తున్న ఈ-పంట నమోదును పరిశీలించారు. ప్రతి రైతు తాను సాగుచేసిన పంటలను ఈ-పంటలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని, లేకపోతే పథకాలు వర్తించవన్నారు. పంట నమోదును ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏఓ కృష్ణచైతన్య, ఏఈఓ సుజిత, వీహెచ్ఏ గిరిబాబు ఉన్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సలీం బాషా


ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును అందుకుంటున్న డాక్టర్ సలీం బాషా


ఉత్తమ టీచర్ అవార్డు అందుకుంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిత

అనంతపురం: రాఘవేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ సలీం బాషాకు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు దక్కింది. వైవీ రావు సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, విజయవాడలో ఏపీ ఎంఈడీ ప్రొస్పెరిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవార్డు అందజేశారు. సలీం బాషా విద్యా రంగానికి విశేష సేవలు అందించారు. దీంతో పురస్కారానికి ఎంపిక చేసినట్లు అసోసియేషన్ పేర్కొంది.

• శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి. అనితకు బెస్ట్ టీచర్ అవార్డును అందజేశారు. 20 సంవత్సరాలుగా ఆమె చేస్తున్న సేవలకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఏపీ ఎంఈడీ ప్రొస్పెరిటీ అసోసియేషన్ పేర్కొంది.

ఇద్దరు విద్యార్థుల అదృశ్యం


బి.భరత్ రాజ్


డి.లోకేష్

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయానగర్‌లోని ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులిద్దరు అదృశ్యమయ్యారు. పాఠశాల హాస్టల్‌లో ఉంటున్న వారు శనివారం ఉదయం ఎటో వెళ్లిపోయారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురంలోని గంగానగర్‌కు చెందిన బి.దివాకర్ కుమారుడు బి.భరత్ రాజ్, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన డి.రవి నాయక్ కుమారుడు డి.లోకేష్ నాయక్ చిన్మయానగర్‌లోని ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 8వ తరగతి చదువుతూ..అక్కడే వసతి గృహంలో ఉంటున్నారు. ఇద్దరు విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు పాఠశాల వసతి గృహం నుంచి ఎక్కడికో వెళ్లిపోయారు. దీంతో హాస్టల్ సిబ్బంది కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి సమీప ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శనివారం రాత్రి రాప్తాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థుల ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 9440796817 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ టీవీ.శ్రీహర్ష సూచించారు.

పోలికేక విజయవంతం చేయండి

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పునరుద్ధరించాలని ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15న తలపెట్టిన పోలికేక ర్యాలీని విజయవంతం చేయాలని కమిటీ సభ్యుడు అక్కులప్ప పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కక్ష సాధిస్తూ ఆర్డీటీకి నిధులు రాకుండా నిలుపుదల చేసిందన్నారు. ఈ చర్యను నిరసిస్తూ ఈ నెల 15న ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పోలికేక ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. దళిత, గిరిజనులు, బీసీలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాకే హరి, దాసగాని కుళ్లాయప్ప. బీసీ ఆర్ దాస్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లో రెవెన్యూ క్రీడలు

గార్లదిన్నె: అనంతపురంలో నవంబర్ 7నుంచి 9వ తేదీ వరకూ ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడాలు, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వీఆర్ఏల జిల్లా వైస్ ప్రెసిడెంట్ నాగరాజు తెలిపారు.శనివారం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ నాయకుల సమావేశంలో రెవెన్యూ క్రీడల గురించి చర్చించామన్నారు. రెవెన్యూ క్రీడల్లో వీఆర్ఏల స్థాయి నుంచి డిప్యూటీ కలెక్టర్ స్థాయి వరకు పాల్గొంటారన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవాలు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో సయ్యద్ హజరత్ 678వ ఉరుసు ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతులు, కమిటీ సభ్యులు చాదర్, గంధం సమర్పించారు. భక్తులు భారీగా తరలివచ్చారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి ఖవాలీ పోటీలు నిర్వహించారు. ఆదివారం జియారత్‌తో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయి. చివరి రోజు ఆర్కెస్ట్రా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

వ్యక్తి అదృశ్యం


పర్వేజ్ ఆలం (ఫైల్)

అనంతపురం: నగరంలోని శ్రీనివాస్ నగర్‌కు చెందిన ఎం.పర్వేజ్ ఆలం అదృశ్యమయ్యాడు. ఈ నెల 9 న ఇంటి నుంచి వెళ్లిపోయి ఇప్పటి దాకా తిరిగి రాలేదని సోదరుడు ఎం. షహబాజ్ ఆలం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. పర్వేజ్ ఆలంకు 2020లో వివాహం జరిగిందన్నాడు. పెళ్లయిన ఒక్క రోజుకే భార్య వదిలిపెట్టి వెళ్లిపోయిందన్నాడు. అప్పటి నుంచి పర్వేజ్ ఆలం ఒంటరిగా బాధపడుతూ మతస్థిమితం కోల్పోయాడని, ఈ నెల 9 నుంచి ఇంటికి రాకపోవడంతో మసీదుల వద్ద, బస్టాండు, రైల్వే స్టేషన్ వద్ద వెతికినా కనిపించలేదని పేర్కొన్నాడు.

చీనీ మార్కెట్ కంపు కంపు


చీనీకాయలు, చెత్తాచెదారంతో నిండిపోయిన మార్కెట్‌లోని డ్రైనేజీ కాలువ

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఉన్న చీనీ మార్కెట్‌లో అపరిశుభ్రత తాండవిస్తోంది. మార్కెట్‌లోకి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. గిట్టుబాటు ధరల్లేకపోవడంతో చీనీకాయలు ఎక్కడిక్కడ పడేశారు. చెత్తాచెదారం పేరుకుపోయింది. డ్రైనేజీ వ్యవస్థ చూస్తే కంపు కంపుగా మారింది. కనీసం రెండు రోజులకోసారి క్లీన్ చేయాల్సివున్నా... వారాల తరబడి పేరబెట్టడంతో టన్నుల కొద్దీ వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తోంది. వీటికి తోడు వర్షాలు రావడంతో చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. వాటి మధ్యనే క్రయ విక్రయాలు, లోడింగ్ చేస్తున్న పరిస్థితి నెలకొంది. మార్కెట్‌యార్డు యంత్రాంగం నిర్లక్ష్యం, ఉదాసీనత కారణంగా ఈ దుస్థితి తలెత్తినట్లు చెబుతున్నారు.



అపరిశుభ్రత మధ్యనే చీనీకాయల క్రయ విక్రయాలు, లారీల్లోకి లోడింగ్ చేస్తున్న దుస్థితి


ధరల్లేక మార్కెట్‌లో ఎక్కడికక్కడ పడేసిన చీనీకాయలతో తాండవిస్తున్న అపరిశుభ్రత


చెత్తాచెదారం, చీనీకాయలతో నిలిపిన ట్రాక్టర్